క్లుప్తంగా

11వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా 'దాట్ల'



తెనాలిరూరల్: 11వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది దాట్ల మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవలి వరకు ఇదే కోర్టు ఏపీపీగా పని చేసిన ఆయన కాల పరిమితి ముగిసింది. తిరిగి ఆయన్నే ఏపీపీగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జె.సుదర్శనరెడ్డి నుంచి ఉత్తర్వులను అందుకున్నారు. మూడేళ్ల పాటు మోహన్‌రెడ్డి 11వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా సేవలు అందిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా మోహన్‌రెడ్డి స్వగ్రామం బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు.

రూరల్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



తెనాలిరూరల్: తెనాలి రూరల్ ఎస్‌ఐగా పి.కోటేశ్వరరావు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన 2013లో ట్రైనీ ఎస్‌ఐగా తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లోనే శిక్షణ పొందారు. అనంతరం వెల్దుర్తి, యడ్లపాడు, పెదనందిపాడు, చిలకలూరిపేట, పొన్నూరు రూరల్, అమరావతిలో పని చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. నూతన ఎస్‌ఐకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉన్నతాధికారులను కలిశారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న సీహెచ్.వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లాకు బదిలీ అయిన సంగతి తెలిసిందే.

సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం



తెనాలిటౌన్: భారత కోకిల సరోజిని నాయుడు జయంతి సందర్భంగా విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయ ఆడిటోరియంలో నవభారత్ నిర్మాణ సంఘం గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. పుణ్యభూమి నా దేశం నమో నమామి అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారి పాల్గొన్నారు. పుణ్యభూమి నా దేశం శీర్షిక పేరిట పద్యపఠనం చేశారు. ప్రజ్ఞాచారి తన పద్యాలలో దేశ ఔన్నత్యం, దేశ భక్తి, పర్యావరణం, ప్రపంచశాంతి, తెలుగు భాష అభిమానం ప్రజల్లో పెంపొందే విధంగా ఆయా అంశాలను పొందుపరచి పద్యరచన చేశారు. న్యాయనిర్ణేతలు అతనిని ఎంపిక చేశారు. సాహితీ సంస్థల వ్యవస్థాపకులు కలిమి శ్రీ, గాంధీ నటరాజన్, తదితరులు ప్రజ్ఞాచారిని అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

ప్రశాంతంగా ముగిసిన వేలం

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని కూరగాయాలు, చేపలు, చికెన్, మటన్, జంతు వధ శాల, పండ్ల మార్కెట్‌కు సంబంధించిన వేలం పాటలను సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి సోమశేఖర్ యాదవ్ తెలిపారు. కూరగాయాల మార్కెట్‌ను అబ్బవరపు వెంకటేశ్వరరెడ్డి రూ.15 లక్షలకు, జంతు వధ శాల, చేపలు, చికెన్, మటన్ మార్కెట్‌లను షేక్ సైదా రూ.4లక్షల 70వేలు, పండ్ల మార్కెట్‌ను యూజేసీ రూ.1.30 లక్షలకు పాడుకున్నట్లు చెప్పారు. వీరి కాల పరిమితి ఏడాదిపాటు ఉంటుందన్నారు.

వైభవంగా భావనారుషి స్వామి రథోత్సవం

తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులో వేంచేసియున్న భద్రావతి సహిత భావనారుషి స్వామివార్ల కళ్యాణమహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఏడు గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. రథంపై స్వామి, అమ్మవార్లను నెమలి వాహనంపై ఆసీనులను చేశారు. పట్టణ వీధుల్లో వైభవంగా ఊరేగింపు సాగింది. పద్మశాలీయ కులబంధువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 11వ తేదీన ఆరంభమైన కళ్యాణ మహోత్సవాలు ఈనెల 29వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బిట్రా రామలింగేశ్వరరావు, పద్మశాలి బహూత్తమ సంఘం అధ్యక్షుడు బట్టు జగత్‌కోటి నరేంద్ర బాబు, సంఘ ప్రధాన కార్యదర్శి కొడాలి క్రాంతికుమార్, దేవస్థానం బోర్డు సభ్యులు గుంటి ధనలక్ష్మి, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, తాడిపర్తి చంద్రశేఖర్, కొతరపు వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రం కొల్లిపరలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గుర్తించి అతని నుంచి 12 క్వార్టరు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

పేదల ఆరోగ్య కేంద్రం.. పీహెచ్‌సీ

- పెరుగుతున్న ఓపీ సేవలు
- పీహెచ్‌సీలో అధునాతన వైద్య పరికరాలు
- చిన్నారులకు, గర్భిణీలకు ప్రత్యేక వైద్యసేవలు



కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తెనాలిటౌన్: తెనాలి మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేద ప్రజలకు మెరుగైె వైద్యసేవలు అందుతున్నాయి. వైద్యులు, సిబ్బంది ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. రోజు రోజుకి వైద్య సేవలను ప్రభుత్వం విస్తరించడంతో పేదలు ఎక్కువగా పీహెచ్‌సీకి వెళ్లి వైద్యం పొందుతున్నారు. గర్భిణులకు ప్రతి నెల చికిత్సను కూడా అందిస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది గర్భిణులకు నెల నెల పరీక్షలు చేయించుతున్నారు.

కొలకలూరు పీహెచ్‌సీ పరిధిలో కొలకలూరు, హాఫ్‌పేట, గుడివాడ, కోపల్లె, నందివెలుగు, కఠెవరం, ఎరుకలపూడి, డీపీ అగ్రహారం, కంచర్లపాలెం, సోమసుందరపాలెం, అత్తోట గ్రామాలు ఉన్నాయి. గ్రామాల పరిధిలో పురుషులు 22,149 మంది, స్త్రీలు 22,748 మంది ఉన్నారు. గృహాలు 12,526 ఉండగా, కుటుంబాలు 14,378 ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల స్థానంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాలు పేదలకు వైద్యసేవలు అందించుతున్నాయి.



24 గంటల వైద్యసేవలు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నారు. సిబ్బంది మూడు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు పాము, కుక్క కాటు, తదితర వాటికి చికిత్సలు చేస్తున్నారు. 12 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు కోవిడ్ వ్యాక్సిన్ వేస్తున్నారు. 0–5 పిల్లలకు టీకాలు వేయడం జరుగుతుంది. రోజువారి ఓపీ పెరిగింది. గత ఏడాది 60 నుంచి 70 వరకు ఉన్న ఓపీ ఈ ఏడాది రోజుకు 120 వరకు ఉంది. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాల్లో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినప్పుడు 150 వరకు ఓపీ వస్తుందని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు తెలిపారు. పీహెచ్‌సీలో రోగుల కొరకు ఆరు పడకలు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక వైద్యులతో చికిత్సలు..

వారంలో రోజుకు ఒక స్పెషలిస్ట్ డాక్టర్ రోగులకు ప్రత్యేక వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పీడియాట్రిక్, డెంటల్, ఊపిరితిత్తులు, గైనిక్, డెర్మటాలజి, తదితర వ్యాధులకు సంబంధించిన ప్రత్యేక వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. దీంతో రోగుల సంఖ్య పెరిగింది.

పీహెచ్‌సీలో అధునాతన పరికరాల ఏర్పాటు..

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే నేపథ్యంలో ప్రభుత్వం పీహెచ్‌సీకి అధునాతన పరికరాలు ఏర్పాటు చేసింది. హెమటాలజీ అనలైజర్ మిషన్‌తో రక్త కణాల పరీక్షలు, రక్త పరీక్షలు, జ్వర పరీక్షలు చేయవచ్చు. బయో కెమిస్ట్రీ అనలైజర్‌తో షుగర్, కిడ్నీ, లివర్, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయవచ్చు. ఈ పరికరాలతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని వైద్యులు, సిబ్బంది తెలియజేస్తున్నారు.

ఫైలేరియా వ్యాధిపై ప్రత్యేక పరీక్షలు..

పీహెచ్‌సీ పరిధిలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈ నెల 3, 4 తేదీలలో రాత్రి వేళలో డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, డాక్టర్ దిలీప్ పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు రక్త పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ పరిధిలో సుమారు 300 మందికి పరీక్షలు జరిపి జిల్లా డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయానికి పంపారు. అక్కడ పరీక్షల అనంతరం ఎవరికీ ఫైలేరియా వ్యాధి లేనట్లుగా నిర్ధారణ అయినట్లు డాక్టర్ తెలిపారు.


రక్త పరీక్షలు నిర్వహించే హెమటాలజీ అనలైజర్


గర్భిణీలకు బీపీ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య కార్యకర్త


పీహెచ్‌సీలో ఉన్న పడకలు

పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యం..



పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది సహకారంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరోగ్య పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్ అధికారులతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ కొలకలూరు

కుక్క కాటుకు వైద్యం అందించారు..



నేను కరెంట్ పనులు చేసుకుని జీవిస్తున్నాను. పనుల నిమిత్తం వెళ్తుండగా కుక్క కరిచింది. దీంతో కొలకలూరులోని పీహెచ్‌సీకి వెళ్లాను. సిబ్బంది స్పందించి ఇంజెక్షన్ ఇచ్చారు. దీనివలన ప్రమాదం నుంచి బయటపడ్డాను. ప్రభుత్వం పీహెచ్‌సీలో అన్ని రకాల జబ్బులకు మందులు అందిస్తోంది. ఆరోగ్య సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పీహెచ్‌సీల అభివృద్ధికి కృషి చేయడం గర్వకారణంగా ఉంది.

– మాదు శ్రీనివాసరావు, నందివెలుగు

నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు..



పంచాయతీలో కార్మికునిగా పనిచేస్తూ ఉంటాను. ప్రమాదవశాత్తు కాలికి దెబ్బతగిలింది. పీహెచ్‌సీకి వెళితే సిబ్బంది కాలును శుభ్రం చేసి మందులు ఇచ్చారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు.

–నర్రా నాగభూషణం, కొలకలూరు

గంజాయి ముఠా అరెస్ట్

ఎనిమిది మందిని అరెస్ట్ చేసి 3.6 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్థనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ ప్రకాశరావు

తెనాలిరూరల్: చెడు వ్యసనాలకు బానిసలై అక్రమంగా గంజాయి అమ్ముతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గంజాయి నిందితుల వివరాలను డీఎస్పీ బి.జనార్థనరావు తెలియజేశారు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు ఎనిమిది మంది సభ్యుల ముఠా గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. పట్టణ ఆర్‌ఆర్‌నగర్‌కు చెందిన షేక్ నాగూరా, ఐతానగర్‌కు చెందిన రాహుత్ సల్మాన్ జ్యోతుల రాజ్‌పాల్, ఉప్పుతోళ్ల స్వామి, సీఎం కాలనీకి చెందిన మందూరి ఏడుకొండలు, సింహాద్రి పూర్ణచంద్, బాలాజీరావుపేట మహేంద్ర కాలనీకి చెందిన బల్లం భీమరాజు, ద్వారకా నగర్‌కు చెందిన మక్కెన చంద్రకిరణ్ పాత నేరస్తులు. జల్సాలు, గంజాయి, మత్తుపదార్థాలకు అలవాటు పడిన వీరు తేలికగా డబ్బు సంపాదించేందుకు కొంత కాలంగా గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. నర్సీపట్నంలో నాలుగు కిలోల గంజాయిని రూ.10 వేలకు కొని ఇక్కడ పొట్లాలు కట్టి అమ్ముతున్నారు. వీరి అక్రమ వ్యాపారంపై సమాచారంతో నిఘా ఉంచిన త్రీ టౌన్ పోలీసులు రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ షెడ్డు వద్ద తనిఖీలు చేయగా వీరి వద్ద గంజాయి గుర్తించారు. నిందితుల వద్ద నుంచి 3.6 కిలోల గంజాయి రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. తెనాలిలో ఇప్పుడిప్పుడే గంజాయి విక్రయాలు తగ్గుముఖం పడుతున్నాయని, పూర్తిగా అరికట్టేందుకు అందరూ సహకరించాలని కోరారు. నిందితులను అదుపులోకి తీసుకున్న త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్ బాబు, ఏఎస్‌ఐ షేక్ హైదర్ అలీ, పీసీలు ఎం.అంకయ్య, పి.మురళి తదితరులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తెనాలిలో డాక్టర్ ఉమ్మారెడ్డి పర్యటన

- డాక్టర్ ఉమ్మారెడ్డి రాకతో కిటకిటలాడిన పార్టీ కార్యాలయం
- పార్టీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆప్యాయంగా పలకరించిన డాక్టర్ ఉమ్మారెడ్డి


పార్టీ కార్యాలయంలో డాక్టర్ ఉమ్మారెడ్డికి స్వాగతం పలికిన నాయకులు

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సోమవారం తెనాలి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పార్టీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా తన కుమారుడు ఉమ్మారెడ్డి వెంకటరమణ నియమితులైన తర్వాత, డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాన్ని తొలిసారిగా సందర్శించారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలుసుకున్నారు. పలువురు నాయకులు శాలువాలతో డాక్టర్ ఉమ్మారెడ్డిని సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. గతంలో ఆయనతో కలిసి పనిచేసిన నాయకులు నాటి అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అందరినీ ఆయన ఆప్యాయంగా పలకరించారు. బాపట్ల నుంచి మధ్యాహ్నం వచ్చిన ఉమ్మారెడ్డి ముందుగా తెనాలి రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడి సీనియర్ నాయకుడు నాగమోతు నాగేశ్వరరావు నివాసానికి వెళ్లారు. అక్కడ నుంచి తెనాలి పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు జి.మానసరెడ్డి, కొర్ర యశోద, అవుల కోటయ్య, యాతాటి అనిల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్ బాబు, మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, కార్పొరేషన్ డైరెక్టర్లు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఉడుముల మహేష్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు కుర్రా జస్వంత్, పార్టీ నేతలు బూరెల దుర్గాప్రసాద్, తాడిబోయిన రమేష్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కాకి దేవసహాయం, కఠారి హరీష్, కొమ్ము రాయల్, కొడాలి క్రాంతి, కోలా వాసు, టంకశాల వాసు తదితరులు డాక్టర్ ఉమ్మారెడ్డిని కలిశారు.

తూములూరులో మాజీ ఎమ్మెల్యేతో...

అనంతరం ఎమ్మెల్యే శివకుమార్‌తో కలిసి కొల్లిపర మండలం తూములూరులో మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి నివాసాన్ని సందర్శించారు. కొల్లిపర మండల పార్టీ నాయకులు అక్కడే ఉమ్మారెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. కొల్లిపర మండల నేతలు భీమవరపు సంజీవరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, ఈమని హరికోటిరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, చంచల రామిరెడ్డి, మర్రెడ్డి చినబాలకోటిరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీటీసీ మాధవి, దావులూరు సర్పంచ్ అంబటి సంధ్యాదేవి, మండల యువజన అధ్యక్షుడు ఈదా యశ్వంత్‌రెడ్డి, ఈదా వెంకటేశ్వరరెడ్డి, అద్దంకి బోసుబాబు, అద్దంకి వేణుగోపాల్ గౌడ్, భేతాళ భూషణం తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో రైతులకు అందుబాటులో ఉండాలి


సొసైటీ పాలక మండలి అధ్యక్షులకు ప్రమాణ స్వీకార పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: కొల్లిపర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయంలో నూతన పాలక మండలి అధ్యక్షులుగా ఆరిమండ కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు భీమవరపు రవీంద్రారెడ్డి, రెడ్డి శివనాగిరెడ్డిలతో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం సొసైటీ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయించి వారికి అభినందనలు తెలియజేశారు. సబ్‌డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ శోభన్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా అనేక సేవలు అందిస్తుందన్నారు. నూతన పాలక మండలి నిత్యం అందుబాటులో ఉంటూ సొసైటీ ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రుణాలు అందజేసి, వాటిని తిరిగి సకాలంలో వసూలు చేసి సొసైటీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. నూతన పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. నూతన పాలక మండలి అధ్యక్షులు, సభ్యులకు పలువురు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి గుదిబండి శివనాగిరెడ్డి, తూములూరు సొసైటీ అధ్యక్షులు ఈమని హరికోటిరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, ఎంపీటీసీ చిలుమూరు ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, పార్టీ నాయకులు నెర్ల కుటుంబరెడ్డి, కళ్లం వీరారెడ్డి, గుదిబండి వేణుగోపాలరెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, అవుతు శ్రీనుశేఖరరెడ్డి, చెంచల రామిరెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రురాజు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు యూపీఎస్ అందజేత

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాష ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందిమళ్ళ రమేష్‌బాబు పాఠశాల అవసరాల నిమిత్తం యూపీఎస్‌ను బహూకరించారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీధర్‌కు యూపీఎస్‌ను ఆయన అందజేశారు. దీని విలువ సుమారు రూ.5వేలు ఉంటుందని తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ రమాదేవి, లీలారాణిలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి పుస్తకాలను పరిశీలించారు. అనంతరం వారితో పాఠ్య పుస్తకాలు చదివించి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం అమలు, విద్యార్థుల నైపుణ్యాలకు సంబంధించిన అంశాలపై హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు రిజిస్టర్లు, రికార్డుల నిర్వహణ పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంచాలని సూచించారు.

వైభవంగా పుష్కర బ్రహ్మోత్సవ మహాకుంభాభిషేకం


ఉత్సవాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని దుర్గాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పుష్కర బ్రహ్మోత్సవ మహాకుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గత మూడురోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి చివరి రోజైన సోమవారం పూర్ణాహుతి, అనంతరం మహాకుంభాభిషేకం చేశారు. శతాధిక ప్రతిష్టాపనాచార్య దుర్భాకుల సాంబమూర్తి అవధాని, విష్ణుభట్ల ఆంజనేయ చయనులు పర్యవేక్షణలో శ్రీసచ్చిదానంద సరస్వతీ మహాస్వాముల చేతుల మీదుగా మహాకుంభాభిషేకం జరిపించారు. ఈ వేడుకకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరయ్యారు. సంప్రదాయ బద్ధంగా వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. తదుపరి అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి ఏడు గంటలకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొండా లక్ష్మీనారాయణ–లక్ష్మీదేవి, పుచ్చా గోపాలకృష్ణమూర్తి–శైలజ దంపతులు, వడ్లమూడి రాఘవేంద్ర శివవరప్రసాద్, బ్రహ్మాండం సుబ్రహ్మణ్యశాస్త్రి–రాజ్యలక్ష్మి, కొండా విమలాదిత్య–అనూరాధ, పిన్నమరాజు వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ, కఠారి హరీష్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక


మురుగుకాల్వలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 18వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంతో సిబ్బందిపై కొంత అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజు వాటిని బాగు చేయించే విధంగా చూడాలని ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ తోట రఘురామ్, 18వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ అన్సారీ, కృష్ణబలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, బ్రదర్ ఆనందన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఏఈ చైతన్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి



తెనాలిరూరల్: రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన తెనాలి–రేపల్లె రైలు మార్గంలోని పల్లెకోన స్టేషన్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం పడి ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుంది. రైల్లో నుండి ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెనుకబడిన వర్గాల ఆరాధ్యుడు బీపీ మండల్



గుంటూరు రూరల్: సామాజిక ఉద్యమకారుడు, రిజర్వేషన్ల సాధకుడు బీపీ మండల్ అని బీసీ సంఘం నాయకుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం అమరావతి రోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నందున్న బీపీ మండల్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించటం జరిగిందన్నారు. వెనుకబడిన వర్గాల ఆరాధ్యుడు బీపీ మండల్ అని కొనియాడారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ మండల్ సిఫారసుల్లో కేవలం రెండింటిని మాత్రమే అమలు చేస్తున్నారని ఇది చాలా అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల నాయకులు పీవీ రమణయ్య, కుమ్మరి క్రాంతికుమార్, టీ కేశవయ్య, దాసరి శివకుమార్, పీ బాలయ్య, డాక్టర్ కోటేశ్వరరావు, టీ నరసింహారావు, గాయత్రి, తదితరులున్నారు.